సాక్షి ప్రకాశం
ఆదివారం । 23 । జూన్ । 2024



రాగి సాగు.. లాభాలు బాగు

జిల్లాలో రైతులు చిరుధాన్యాల పంటలపై ఆసక్తి చూపుతున్నారు. రాగులకు మంచి డిమాండ్ ఉండటంతో రాగిసాగు వైపు మొగ్గుచూపుతున్నారు.

- 8లో..



వైభవంగా శోభాయాత్ర

విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హైందవశక్తి సమ్మేళనం ఆధ్వర్యంలో పామూరులో వీరహనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహించారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39/31

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రైతు భరోసాపై ఉత్తర్వులు రాలేదు

● జేడీఏ శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు సంబంధించి నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం నుంచి ఇంకా విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు రాలేదని జేడీఏ శ్రీనివాసరావు తెలిపారు. 'సాగు సాయం ఏదీ' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా ఈ సంవత్సరం 17వ విడత నిధులను 2,42,851 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున రూ.48.57 కోట్లు జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చే నిధులకు సంబంధించి విధి విధానాలు వ్యవసాయశాఖకు అందిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.340




ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు ధరలు శనివారం గరిష్టంగా రూ.340 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో శనివారం 7437 బేళ్లు రాగా, 7018 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 419 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 87వ రోజు వేలంలో 3776 బేళ్లు రాగా, 3570 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 186 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.340, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.291.52 వచ్చినట్లు చెప్పారు. డీసీపల్లి, కలిగిరి, కందుకూరు–2, ఒంగోలు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 82వ రోజు వేలం పాటలో 3681 బేళ్లు రాగా, 3448 బేళ్లు కొనుగోలయ్యాయి. 233 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.336, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.226.95 వచ్చినట్లు ఆర్‌ఎం తెలిపారు.

చేదెక్కిన చెరకు

- చెరకు రైతులకు కలసిరాని సాగు
- ఏటా తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం
- మార్కెట్ సౌకర్యాలు కరువు
- పెరిగిన పెట్టుబడుల ఖర్చు.. తగ్గిన గిట్టుబాటు ధర
- జిల్లాలో 3 వేల ఎకరాల నుంచి 202.5 ఎకరాలకు పడిపోయిన చెరకు సాగు



ఏపుగా పెరిగిన చెరకు

చెరకు రసం నుంచి బెల్లం పాకం తయారు చేస్తున్న కూలీలు

అచ్చులలో పోసి తయారు చేస్తున్న బెల్లం

అందరికీ తీపిని పంచే బెల్లం.. దాన్ని తయారు చేసే రైతులకు మాత్రం చేదును మిగులుస్తోంది. ఉత్పత్తికి పెట్టుబడులు అధికం కావడం.. గిట్టుబాటు ధర లేకపోవడం రైతులకు శాపంగా మారుతోంది. ఫలితంగా బెల్లం తయారీకి ప్రధానమైన చెరకు సాగు ఏటా తగ్గిపోతోంది. గతంలో వేల ఎకరాల్లో ఉండే సాగు ప్రస్తుతం వందల ఎకరాలకు పడిపోయింది. బెల్లం తయారీ బట్టీల సంఖ్య కూడా 50 నుంచి మూడుకు చేరిందంటే దాని పరిస్థితి అర్థమవుతోంది.

ఒంగోలు సెంట్రల్: చెరకు సాగుచేసే రైతులు కనీస లాభాలకు కూడా నోచుకోక క్రమంగా సాగుకు దూరమవుతున్నారు. ఉత్పత్తికి అధికంగా పెట్టుబడులు పెడుతున్నా గిట్టుబాటు ధర లభించకపోవడంతో బెల్లం ఉత్పత్తిదారుల సంఖ్య కూడా క్రమేణా తగ్గిపోతోంది. జిల్లాలో గతంలో మూడు వేల ఎకరాల్లో చెరుకు సాగవుతుండగా ప్రస్తుతం విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. 202.5 ఎకరాలు మాత్రమే ఉంది. ప్రత్యేక బట్టీ ఏర్పాటు చేసి చెరకు నుంచి బెల్లం తయారు చేసి బుట్టలలో పెట్టి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అయితే మార్కెట్ తక్కువగా ఉండటంతో కొంత మేర నష్టాల బాట పట్టారు. దీంతో బెల్లం తయారీ బట్టీలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో తాళ్లూరు ప్రాంతంలో 50కిపైగా ఉండే బెల్లం బట్టీలు ప్రస్తుతం మూడు మాత్రమే ఉన్నాయి.



చెరకురసం తీస్తున్న కూలీలు

రూ.1.50 లక్షల పెట్టుబడి:

జిల్లాలోని తాళ్లూరు మండల పరిసర ప్రాంతాల్లో 39 ఏళ్లుగా చెరకు నుంచి బెల్లం తయారు చేసి విక్రయిస్తున్నారు. ఎకరా సాగుకు పెట్టుబడి, రసాయనాలతో కలిపి రూ.1.50 లక్ష వరకు ఖర్చవుతుంది. ఎకరాకు మూడు నుంచి 3.5 టన్నుల బెల్లం ఉత్పత్తి అవుతుంది.

రాబడి లేక..

ప్రస్తుతం బెల్లం కేజీ రూ.43 వరకు ఉంది. ఉత్పత్తి వ్యయం ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చు కాగా, రాబడి రూ.1.55 లక్షల వరకు వస్తుంది. అంటే కేవలం ఎకరాకు ఐదు వేలు మాత్రమే మిగులుతుందని రైతులు చెబుతున్నారు. గతంలో బెల్లం తయారీ వ్యయం తక్కువ కాగా, నేడు అన్ని రకాల కూలీలు సైతం పెరగటంతో మరింత ఖర్చు పెరిగినట్లు చెబుతున్నారు.

శ్రీకాకుళం నుంచి కూలీలు..

ప్రతి సంవత్సరం బెల్లం తయారీ సమయంలో శ్రీకాకుళం నుంచి ప్రత్యేకంగా కూలీలు ఇక్కడకు వచ్చి బెల్లం తయారు చేస్తుంటారు. వీరికి కేజీకి రూ.20 చొప్పున కూలి ఇస్తున్నారు. చెరకు నరుక్కొని వచ్చి రసం తీసి, బెల్లం తయారు చేసే వరకు వీరిదే బాధ్యత. 30 మంది వరకు ఒక జట్టుగా వచ్చి పనులు చేసుకుని సీజన్ అయిపోయిన తర్వాత వెళ్లిపోతుంటారు.

ప్రతి సంవత్సరం వస్తాం



బెల్లం తయారీకి ప్రతి సంవత్సరం వస్తాం. కాంట్రాక్ట్‌గా తీసుకుని కేజీకి రూ.20 చొప్పున మాట్లాడుకుని చెరుకు నరికి, ట్రాక్టర్‌కు వేసుకుని వచ్చి శుభ్రంగా బెల్లం తయారు చేసి యజమానికి అప్పగిస్తాం. కానీ ఈ సంవత్సరం దిగుబడులు బాగా తగ్గాయి.

– వెంకటేష్, బెల్లం తయారుదారుడు, చీపురుపల్లి



ఆరబోసిన బెల్లం అచ్చులు

నష్టాల బాటలో చెరకు రైతన్నలు



చెరకు రైతులు నష్టాల బాటలో ఉండటంతో అనేక మంది పంట మానేసి మొక్కజొన్న వైపు వెళ్తున్నారు. చెరకు సాగుకు నీరు ఎక్కువగా కావాలి. గత ఎండాకాలం నీరు లేక రసం సక్రమంగా రాక దిగుబడి తగ్గింది. గతంలో 50పైగా ఉండే బట్టీలు ప్రస్తుతం మూడు మాత్రమే ఉన్నాయి.

– జయ రామిరెడ్డి, రైతు, రామభద్రాపురం

చక్కెర ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



ఈ ప్రాంతంలో మూడు దశాబ్దాలపైగా చెరకు నుంచి బెల్లం తయారు చేస్తున్నాం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో బెల్లం రైతుకు మంచి గిట్టుబాటు ధర వచ్చింది. నేడు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది. ఇక కౌలు రైతుల పరిస్థితి దారుణం. ఈ ప్రాంతంలో చక్కెర ఫ్యాక్టరీ పెడితే జిల్లాలో రైతులకు మరింత మేలు చేకూరుతుంది.

– లింగారెడ్డి, రైతు

కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా

● దినేష్‌కుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ



తమీమ్ అన్సారియా



ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లా కలెక్టర్‌గా ఏ తమీమ్ అన్సారియాను నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమీమ్ అన్సారియా శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు డైరెక్టర్‌గా, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌గా వస్తున్న ఆమెకు జిల్లాలో కొంతమేరకు నీటి ఎద్దడి, కరువు పరిస్థితులు సవాలు విసురుతున్నాయి. ఇప్పటి వరకు కలెక్టర్‌గా ఉన్న ఏఎస్ దినేష్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2022 ఏప్రిల్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దినేష్ కుమార్ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పనిచేయించడంలో సఫలీకృతమయ్యారు. ఉద్యోగుల్లో సౌమ్యుడిగా పేరు పొందారు. కలెక్టర్‌గా వచ్చి రెండేళ్లు దాటింది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే పేద విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలనే సంకల్పంతో కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమంతో పాటు విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించారు. అంతేకాకుండా పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు పై తరగతులు చదివేలా ప్రత్యేక శ్రద్ధ వహించి బాల్య వివాహాలను నివారించడంలో ప్రత్యేక పాత్ర పోషించారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

● వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దు.. ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం, నాయకులు పెట్టే అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దన్నారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య వచ్చినా తక్షణం మండల నాయకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా తాను అండగా నిలుస్తానని చెప్పారు. మండల నాయకులంతా కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతి పరులే లక్ష్యంగా టీడీపీ నేతలు దుర్మార్గాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉండి పోరాడుతానని భరోసా ఇచ్చారు. వెలిగండ్ల మండలం జంగం నర్సాయిపల్లికి చెందిన వారిని కేసులో సంబంధం లేని వ్యక్తులను అక్రమంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని దద్దాల నారాయణ అన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానని, అధైర్యపడొద్దని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ జిల్లా నాయకులు ఒమెగా రామిరెడ్డి, గట్ల విజయ భాస్కర్‌రెడ్డి, కటికల వెంకట రత్నం, దాదిరెడ్డి మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై నారశింహుడు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నారశింహుడు గజవాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు. శుక్రవారం గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారికి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి తరువాత గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సోమరాజుపల్లి గ్రామంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. నరశింహస్వామి గరుడ వాహనం పై గ్రామానికి వస్తున్న సందర్భంగా భక్తులు తమ ఇంటి ముందు చలువ పందిళ్లు వేసి స్వామికి హారతులు ఇచ్చి ఆశీర్వాదం పొందారు. ఆదివారం మధ్యాహ్నం స్వామి వారి కళ్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో పీ కృష్ణవేణి తెలిపారు. కళ్యాణోత్సవం సందర్భంగా శ్రీ కృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో కళ్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సినీ పాటకచ్చేరి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



గరుడవాహనంపై నారశింహుడు



గజ వాహనం పై స్వామివారు



ఏరువాక సందర్భంగా పొలంలో అరక కట్టి ఎడ్లకు పసుపు, కుంకుమ దిద్ది పూజిస్తున్న రైతు



ఎడ్లతో అరక కట్టి పొలం దున్నుతున్న రైతులు

ఏరువాక సాగింది

ఏరువాక పౌర్ణమి సందర్భంగా జిల్లాలో రైతులు ఎడ్లను పూజించి అరక కట్టి పొలం దున్నారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులు వర్షాలు అరకొరగానే కురవడంతో పొలం దున్నుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

- సాక్షి, ఒంగోలు

క్లుప్తంగా

26న రాష్ట్రస్థాయి పాస్టర్ల సమావేశం

ఒంగోలు రూరల్: బాప్టిస్ట్ మిషన్ పాస్టర్ల రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఈ నెల 26వ తేదీ విజయవాడలోని ఇబ్రాయిల్ పేటలో నిర్వహించనున్నట్లు ఒంగోలు మండలంలోని ఉలిచి పాస్టర్ రెవరెండ్ శేఖర్‌బాబు తెలిపారు. బాప్టిస్ట్ మిషన్‌లో వివిధ రంగాలలో ఉన్న అధికారులు, పాస్టర్లు వారి వారి రంగాల ఐక్యత, పలు అంశాలపై సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. పాస్టర్లంతా హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



లారీ కింద పడిన ద్విచక్ర వాహనం

కొమరోలు: ద్విచక్ర వాహనాన్ని లారీ వేగంగా ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామ సమీపంలో అమరావతి–కడప రాష్ట్రీయ రహదారిపై శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బొడ్డువానిపల్లె గ్రామానికి చెందిన కాలె గురవయ్య పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై గిద్దలూరు వెళ్తుండగా, బేస్తవారిపేట నుంచి పోరుమామిళ్ల వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో గురవయ్య తీవ్రంగా గాయపడగా, ఓ ప్రైవేటు వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాగి సాగు.. లాభాలు బాగు..!

- రాగి పంట సాగుతో లాభాలు పొందుతున్న రైతులు
- రాగి సంగటి, రాగి జావపై మక్కువ చూపుతున్న ప్రజలు
- మార్కెట్లో డిమాండ్ పెరగడంతో ఆశాజనకంగా ధరలు



రాగి పంట



రాగులు

కొనకనమిట్ల: ప్రధాన ఆహార పంటల్లో రాగి పంట ఒకటిగా చెప్పవచ్చు. చిరు ధాన్యం పంటగా రాగి పంటను పండిస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు వేసవిలో కూడా రాగి పంట సాగు చేస్తారు. రాగిలో క్యాల్షియం అధికంగా ఉండటం, కొవ్వు పదార్థం తక్కువగా ఉండటం, పీచు పదార్థం కావడం, వరి, గోధుమ కంటే పోషకాల శాతం ఎక్కువగా ఉండటంతో ఇటీవల కాలంలో మంచి పౌష్టికాహారంగా రాగిని గుర్తించి ప్రజలంతా వాడుతున్నారు. దీంతో గతంలో తక్కువగా ఉండే రాగి పంట విస్తీర్ణం ప్రస్తుతం పెరిగింది. ప్రభుత్వాలు కూడా రాగి పంటకు మద్దతు ధరలు కల్పించడంతో రైతులు లాభాలు పొందుతున్నారు.

జిల్లా రైతులు చిరు ధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించారు. ముఖ్యంగా రాగి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి తడులకు అవకాశం ఉన్న రైతులు రాగి పంటతో పాటు వేరుశనగ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాగులకు మంచి గిరాకీ ఉంది. గతంలో గ్రామాల్లో రాగి, సజ్జ, కొర్ర, సామ, అరిక, వరిగ పంటలు సాగుచేసేవారు. క్రమంగా ఆయా పంటల సాగు తగ్గుతూ వచ్చింది. ప్రసుత్తం కొన్ని గ్రామాల్లో రాగి, కొర్ర పంట సాగుచేస్తున్నారు. గ్రామాల్లో మధ్యాహ్నం రాగి సంగటి వాడుతున్నారు. హోటళ్లలో కూడా రాగి సంగటి అందుబాటులో ఉంటోంది. షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా రాగి సంగటి తినడానికి ఇష్టపడుతున్నారు. దీంతో రాగి ధాన్యానికి డిమాండ్ పెరిగింది. రాగులతో పాటు రాగి గడ్డికి కూడా మంచి గిరాకీ ఉండటంతో చెరువులు, బోరు బావుల కింద వరి, మాగాణి భూముల్లో వరి కోసిన తర్వాత రాగి పంట సాగు చేస్తున్నారు. రైతుల వద్దనే కిలో రూ.40 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రాగి పంట సాగుతో మంచి లాభాలు రాబడుతున్నారు. కొనకనమిట్ల మండలంలో బచ్చలకూరపాడు, వెంగళపల్లి, నరసాయపల్లి, తువ్వపాడు, వాగుమడుగు, కాట్రగుంట, తన్నీరువారిపల్లి, ఓబులరెడ్డిపల్లి, పాతపాడు గ్రామాల్లో ఎక్కువగా రాగి పంట సాగుచేస్తున్నారు.

అధిక దిగుబడినిచ్చే రకాలు...

రాగి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలలో మేలైన రకం మారుతీ రకం. ఈ రకం పంట 85 నుంచి 90 రోజుల్లో దిగుబడి వస్తుంది. తెగుళ్లను తట్టుకుని 10 క్వింటాల వరకు దిగుబడినిస్తుంది. అన్ని ప్రాంతాల్లో సాగుచేసేందుకు వీలుగా ఉంటుంది. మిగతా రకాలైన వేగావతి, సువర్ణముఖి, వకుళ, భారతి, హిమ, శ్రీచైతన్య రకాలు కూడా అధిక దిగుబడినిస్తాయి.

విత్తనశుద్ధి ఇలా...

రాగి పంట సాగు చేసే సమయంలో విత్తనశుద్ధి అవసరం. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజం అనే మందు కలిపి విత్తనశుద్ధి చేయడం ద్వారా పంటకు తెగుళ్లు సోకకుండా ఉంటాయి. నారు నాటే పద్ధతిలో అయితే ఒక ఎకరానికి నారు కావాలంటే 2 కేజీల విత్తనాన్ని 5 సెంట్ల భూమిలో నారుమడిలో పోయాలి. 21 రోజుల నారుని పొలంలో నాటాలి. పొలం దున్నిన తర్వాత ఆఖరి దుక్కిలో మూడు నుంచి నాలుగు టన్నుల పశువుల ఎరువు వాడాలి. ఖరీఫ్‌లో వర్షాధారంగా పండించే రాగి పంటకు 24 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాషియం వేయాలి. అగ్గి తెగుళ్ల నివారణకు ట్రైసైక్లోజెల్ 6 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వెర్రి తెగులు నివారణకు మెటలాక్సిల్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు కొరాజిన్ 3 మి.లీటరును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ విధంగా పంట సస్యరక్షణ చేస్తే పంట అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు.

రాగితో ఆరోగ్యం...

రాగి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రాగులతో చేసిన సంగటి, రాగి జావ తీసుకుంటే ఎంతో మంచిది. రాగులు వంద గ్రాములు తీసుకుంటే.. అందులో 344 మిల్లీ గ్రాముల క్యాల్షియం, 328 క్యాలరీలు, 3.6 గ్రాముల పీచు పదార్థాలు, 7.3 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది.

అందుకే పూర్వం ఎక్కువగా రాగులతో చేసిన పదార్థాలే తినేవారు. రాగి జావ వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయి. రాగులు వాడటం వలన బరువు తగ్గుతారు.



బుర్రా లక్ష్మమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

బుర్రా లక్ష్మమ్మకు మంత్రి పార్థసారథి నివాళులు

టంగుటూరు: కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాతృమూర్తి బుర్రా లక్ష్మమ్మ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు టంగుటూరు మండలం శివపురం గ్రామంలో వృద్ధాప్యంతో కన్నుమూశారు. ఆమె భౌతిక కాయానికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి కొలుసు పార్థసారథి శనివారం పూలమాలతో నివాళులర్పించి బుర్రా కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, కందుకూరు, కొండపి నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రా లక్ష్మమ్మకు నివాళులర్పించారు. అనంతరం స్వగ్రామం శివపురంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పోలేరమ్మా దీవించమ్మా...



అలంకరణలో పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి



నైవేద్యాలు చెల్లిస్తున్న భక్తులు



ఆలయం వద్ద అన్నదానం

- వాగుమడుగులో ఘనంగా ఏరువాక పోలేరమ్మ తల్లి జాతర
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాలుగు విద్యుత్ ప్రభల ఏర్పాటు

కొనకనమిట్ల: అమ్మా.. పోలేరమ్మతల్లి దీవించమ్మా అంటూ మండలంలోని వాగుమడుగు గ్రామంలో పోలేరమ్మతల్లి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఏరువాక పోలేరమ్మతల్లి జాతరను పురస్కరించుకొని శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అమ్మవారి కలశాన్ని గ్రామంలో ఉత్సవం నిర్వహించి ఆలయంలోకి తీసుకొచ్చారు. పలువురు భక్తులు అమ్మవారికి వెండి వస్తువులు బహూకరించి 101 టెంకాయలు కొట్టి తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున నాలుగు, టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద శ్రీకృష్ణ యాదవ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారికి కుంకుమ బండ్లు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని పోలేరమ్మ ఆలయాన్ని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. జాతరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొనేందుకు రావటంతో పాటు పలు రకాల షాపులు ఏర్పాటు చేయటంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొదిలి సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ మాధవరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఒంగోలు: రాష్ట్రంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కోటేశ్వర రావు, జి.రవికిషోర్ డిమాండ్ చేశారు స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఎల్ఐసీ ఏజెంట్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా ఏజెంట్లు రిటైరైన తరువాత పెన్షన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఏజెంట్ల పిల్లలకు స్కాలర్‌షిప్ వసతి కల్పిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ఏజెంట్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఐసీ సంస్థను బలహీనపరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని, 65 సంవత్సరాల పరిమితి ఎత్తివేయాలన్నారు. గ్రాట్యుటీపై ఉన్న సీలింగ్ ఎత్తివేయాలని, గ్రాట్యుటీ లెక్కింపు విషయంలో అశాస్త్రీయ పద్ధతిని మార్చాలని , ఈ డిమాండ్ల సాధన కోసం పోరాటాలను రూపొందిస్తామన్నారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజశేఖర్, నెల్లూరు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజవాడ శివయ్య, సీహెచ్ నరశింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన నీటి పన్ను



పంచాయతీలో కార్యదర్శులను విచారిస్తున్న ఈఓపీఆర్డీ రఘుబాబు

- మద్దిపాడు మండలం దొడ్డవరంలో వెలుగుచూసిన వ్యవహారం
- సుమారు రూ.36 లక్షల ఫైబిలుకు మాయం
- అధికారుల చొరవతో రూ.18 లక్షలు జమ

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పబ్లిక్ వాటర్ స్కీమ్‌లో జరిగిన స్కాం గురించి సాక్షి దినపత్రిక గతంలోనే కథనం ప్రచురించింది. ఈ విషయంపై సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిందిగా డీపీఓ ఉషారాణి, డీఎల్‌పీఓ ఆర్.పద్మ ఆదేశించిన నేపథ్యంలో.. వారం రోజులుగా మద్దిపాడు ఈఓపీఆర్డీ కె.రఘుబాబు దొడ్డవరం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. 2021 నుంచి 2024 ఏప్రిల్ వరకూ పనిచేసిన కార్యదర్శులను శుక్రవారం దొడ్డవరం పిలిపించి విచారణ నిర్వహించారు. 2021 జూన్ నెల నుంచి ఏప్రిల్ 2024 వరకూ మొత్తం 36 లక్షల రూపాయలు గోల్‌మాల్ అయ్యాయని ఈఓపీఆర్డీ లెక్కలు తేల్చారు. దొడ్డవరం పంచాయతీ సర్పంచ్ సుబ్బారావు, అప్పటి గ్రామ కార్యదర్శి జానీబాషా ఇద్దరూ కలిసి యూనియన్ బ్యాంక్ దొడ్డవరం బ్రాంచిలో 079812014000246 నంబర్‌తో పబ్లిక్ వాటర్ స్కీం, దొడ్డవరం పేరుతో ప్రైవేటు అకౌంట్‌ను ప్రారంభించారు. గ్రామ పంచాయతీలోని 14వ వార్డు మెంబర్ బి.వెంకట్రావును తన భార్య అలేఖ్య పేరుతో నీటి పన్ను వసూలు చేయడం కోసం నియమించుకున్నారు. 2021 జూన్ నుంచి 2021 నవంబర్ వరకూ రూ.6,67,150 వసూలు చేయగా, కేవలం రూ.1,26,000 మాత్రమే అకౌంట్‌కు జమ చేశారు. 2021 డిసెంబర్ నెలలో రూ.76,150 వసూలు చేయగా, అదనంగా కొంత కలిపి 88,000 రూపాయలు జమ చేశారు. 2022 జనవరి నెలలో రూ.1,40,600 వసూలు చేయగా, రూ.41,600 జమ చేశారు. ఫిబ్రవరి నెలలో 41,100 రూపాయలు వసూలు చేయగా, కేవలం రూ.4,800 మాత్రమే జమ చేశారు. 2022 మార్చి నుంచి జూలై నెల వరకూ రూ.3,60,400 వసూలు చేయగా, రూ.1,01,403 జమ చేశారు. 2022 ఆగస్టు నుంచి అక్టోబర్ నెల వరకూ 2,46,550 రూపాయలు వసూలు చేయగా, 1,24,500 జమ చేశారు. 2022 నవంబర్‌లో రూ.1,92,150 వసూలు చేసి రూ.71,500 ఖాతాకు జమ చేశారు. 2022 డిసెంబర్ నెలలో 1,94,650 రూపాయలు వసూలు చేయగా, 1,92,000 రూపాయలు జమ చేశారు. 2023 జనవరి నెలలో 3,07,250 రూపాయలు వసూలు చేయగా, రూ.2,33,000 మాత్రమే జమ చేశారు. 2023 ఫిబ్రవరి నెలలో 1,62,250 రూపాయలకుగానూ.. కేవలం 1,07,500 రూపాయలు, 2023 మార్చి నుంచి ఏప్రిల్ 2023, జూన్ 18వ తేదీ వరకూ 3,67,800 రూపాయలు పూర్తిగా జమ చేయకుండా పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ బాషా, గ్రామ సర్పంచ్‌పై నిల్వ ఉన్న బ్యాలెన్స్‌తో పాటు కలిపి వాడుకున్నట్లు ఈఓపీఆర్డీ నిగ్గు తేల్చారు. 2023 జూన్ 19 నుంచి 2024 మార్చి 15వ తేదీ బదిలీపై విధులు నిర్వహించిన టీ అజయ్‌కీర్తి అదే వార్డు మెంబర్ భార్య పేరున 8 లక్షల రూపాయల వరకూ వసూలు చేసి ఆ నిధులను అదే ప్రైవేటు అకౌంట్ నంబర్‌కుగానీ, పంచాయతీరాజ్ శాఖ ఆమోదం పొందిన బ్యాంక్ అకౌంట్‌కుగానీ జమ చేయకుండా స్వాహా చేసినట్లు ఈఓపీఆర్డీ రఘుబాబు తెలిపారు. కాగా, వారం రోజుల క్రితం ఇచ్చిన నోటీసులకు స్పందించిన అజయ్‌కీర్తి 8 లక్షల రూపాయలను వారం రోజుల్లో పలు విడతలుగా జమ చేశారన్నారు. సర్పంచ్ సుబ్బారావు, వార్డుమెంబర్ వెంకట్రావు పాత్రపై కూడా విచారించడానికి ఈ నెల 24వ తేదీ హాజరుకావాలని నోటీసులు ఇచ్చినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు.

వైభవంగా వీరహనుమాన్ విజయ శోభాయాత్ర



విశిష్ట అలంకరణతో ఆంజనేయ విగ్రహమూర్తి



శోభాయాత్రలో ప్రత్యేక ప్రదర్శనలో భజరంగ్‌దళ్ సభ్యులు

పామూరు: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హైందవశక్తి సమ్మేళనం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన పామూరులో శనివారం నిర్వహించిన వీరహనుమాన్ విజయ శోభాయాత్ర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శ్రీమదన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని అభయ అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల్లో హనుమాన్ విజయ శోభాయాత్ర సాగింది. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్లలో డ్యాన్స్ మాస్టర్ బొప్పూరి రాజేష్ ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదే విధంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా యువత పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కనిగిరి డీఎస్పీ ఆర్.రామరాజు, పామూరు సీఐ యం.రామానాయక్, ఎస్సై యం.సైదుబాబు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ జమకాల నరేష్, కోటేశ్వరరావు, బ్రహ్మానందరెడ్డి, పిచ్చయ్య చౌదరి, యారవ శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర నాయకులు కేవీ రమణయ్య, యేల్చూరి బాలకొండలరావు, సరాబు చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.



హనుమత్ శోభాయాత్రలో కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థులు, మహిళలు